# బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతిపక్షాల దిమ్మ తిరగాలి

- కాంగ్రెస్ నాయకులకు నిద్రలేని రాత్రులే..
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని స్కీమ్‌లు తెలంగాణలో చేస్తమంటే నమ్ముతరా?
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- తాము చేసిన పనులను చెప్పకునే ధైర్యం మాజీ ఎమ్మెల్యేలకు ఉందా?
- ప్రజాక్షేత్రంలో చెప్పకొని నిర్ణయాన్ని ప్రజలకే వదిలేద్దాం
- నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- నాగారం, పెద్దకొర్పోలు వట్టివాగుపై చెక్ డ్యామ్ కమ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన


నెక్కొండలో పంటనష్టపరిహారం పంపిణీ చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి, ఎమ్మెల్యే పెద్ది

నెక్కొండ, అక్టోబర్ 7: బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను చూసి అంతా దద్దరిల్లడం ఖాయమని, కాంగ్రెస్ నాయకులు నిద్రలేని రాత్రులు గడపడం ఖాయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండలంలోని నాగారం, పెద్దకొర్పోలు గ్రామాల్లో వట్టివాగులపై చెక్‌డ్యామ్ కమ్ బ్రిడ్జి నిర్మాణ పనులకు శనివారం నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్నతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం నెక్కొండలో ఏర్పాటు చేసిన ప్రగతి సభలో మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయని స్కీంలను తెలంగాణలో అమలు చేస్తామంటే తెలంగాణ ప్రజలు నమ్ముతరా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలోని ఇతర ఏ రాష్ట్రంలోనూ సాగడం లేదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎంత పెన్షన్ ఇస్తుందో చెప్పాలని, అది చెప్పకుండా ఇక్కడ రూ.3వేలు ఇస్తామంటే ప్రజలు నమ్మరని తెలిపారు. రూ.80వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ ప్రాజెక్ట్, 24గంటల ఉచిత కరెంట్, రైతు బంధు, రైతుబీమా వంటి భారీ పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేసి చూపారని, అసాధ్యాలను సుసాధ్యం చేయడం సీఎం కేసీఆర్‌కే సాధ్యమన్నారు. ఏడాది కాలంలో అందరికీ ఇల్లు ఉండేలా చూడటమే లక్ష్యమని చెప్పారు. భారీ ప్రాజెక్ట్‌లు అయిపోయాయని, ఇక సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో ఎలాంటి వరాలు ప్రకటిస్తారో, ఎలాంటి పథకాలకు శ్రీకారం చుడుతారోనని ప్రజలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణలో రెండు పంటలు పండుతున్నాయని, దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయని చెప్పారు. తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో నచ్చిన ముఖ్యమంత్రులు ఇద్దరేనని, ఒకరు ఎన్టీఆర్, మరొకరు సీఎం కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ హయాంలో నర్సంపేట కొట్లాటలకు కేంద్రంగా ఉండేదని, ఇప్పుడు రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌లను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇక్కడికి తీసుకువచ్చారని, జిల్లాలోనే నర్సంపేట నియోజకవర్గానికి అత్యధిక నిధులు వచ్చాయని వివరించారు. ఎకరానికి రూ.10వేల పంటనష్ట పరిహారం అందడం ఎమ్మెల్యే పెద్ది కృషే కారణమన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలుపుతున్న సీఎం కేసీఆర్‌ను, నర్సంపేటను అభివృద్ధిలో అగ్రపథాన నిలుపుతున్న ఎమ్మెల్యే పెద్దిని గుండెల్లో పెట్టుకొని కాపాడుకోవాలన్నారు. నెక్కొండ మండలం జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూచించారు.

### చేసిన పనులు చెప్పకునే ధైర్యం వారికి ఉందా? : పెద్ది

నర్సంపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు తమ హయాంలో చేసిన పనులు చెప్పుకునే ధైర్యం ఉందా? అని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తాను ఒక్క నెక్కొండ మండలంలోనే రూ.250కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్యేగా తాను, వారు చేసిన పనులను ప్రజాక్షేత్రంలో చెబితే ప్రజలే ఆశీర్వదిస్తారని, ఈ సవాల్‌కు వారు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. తన హయాంలో ఎన్ని కిలోమీటర్ల రోడ్లు వేశారో, ఊర్లలో అంతర్గతంగా బీటీ రోడ్లు వేశారో, ఎన్ని లింక్ రోడ్లు వేశారో ఇలా జరిగిన ప్రతి అభివృద్ధి పనులను ప్రజల ముంగిట ఉంచాలన్నారు. మండలంలోని నాగారం – ఇంటికన్నె, పెద్ద కొర్పోలు – చిన్నకొర్పోలు మధ్య వట్టివాగుపై బ్రిడ్జిల నిర్మాణం కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కల నేడు సాకారమైందని చెప్పారు. కరోనా సమయంలో రాష్ట్రంలోనే మొదట ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశానని, రెండు విడుతల్లో ప్రజల బాగోగులు చూసుకున్నానని తెలిపారు. పంట నష్టపరిహారం ఎకరానికి రూ.10వేల చొప్పున 40వేల మందికి అందించామని, ఇంకా రూ.75వేల కోట్ల విలువైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయని, కాంగ్రెస్ కుట్రలను రైతులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్‌ను, తనను నిండు మనసుతో ఆశీర్వదించాలని, నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. అనంతరం పంట నష్టపరిహారం చెక్కులను మంత్రి, ఎమ్మెల్యే కలిసి పంపిణీ చేశారు. ఎంపీపీ జాటోత్ రమేశ్, జడ్పీటీసీ లావుడ్య సరోజ హరికిషన్, సొసైటీ చైర్మన్‌లు మారం రాము, జలగం సంపత్‌రావు, ఘంటా దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, ప్రధాన కార్యదర్శి తాటిపెల్లి శివకుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అబ్దుల్‌నబి, నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేశ్‌యాదవ్, మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు మహబూబ్‌పాషా, కర్ర వెంకట్‌రెడ్డి, బొంపెల్లి రాజేశ్వర్‌రావు, ఆశమ్మ, జల్లె సుదర్శన్, సీనియర్ నాయకులు చల్లా చెన్నకేశవరెడ్డి, సూరం రాజిరెడ్డి, గుంటుక సోమయ్య, మండల నాయకులు అన్నమనేని సంతోశ్, మాదాసు రవి, సారంగపాణి, దేవన బోయిన వీరభద్రయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, చిత్రంలో హనుమకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్

## రేపు పరకాలకు మంత్రి కేటీఆర్

**మున్సిపాలిటీలో రూ.114కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన : ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**


**కలెక్టర్ పట్నాయక్‌తో కలిసి హెలిప్యాడ్, ఆర్డీవో, తహసీల్దార్ ఆఫీసుల పరిశీలన**

**ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష**

పరకాల, సెప్టెంబర్ 7: మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 9న పరకాలకు రానున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేయనున్నారు. ఈమేరకు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శనివారం కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో హెలీప్యాడ్, కొత్త ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ పరిశీలించారు. అనంతరం మున్సిపాలిటీ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే చల్లా మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. రూ.114.65కోట్లతో కొత్తగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు, మిషన్ భగీరథలో భాగంగా పట్టణంలో నిర్మించిన ఇంటర్నల్ పైప్‌లైన్, నల్లాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభించడంతోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అనంతరం పట్టణంలోని పశువుల సంతలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పరకాల వ్యవసాయ మార్కెట్ ఆవరణకు హెలికాప్టర్‌లో కేటీఆర్ చేరుకుంటారని, అక్కడి నుంచి నూతన మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, మరికొన్ని పనులకు శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. పలు పథకాల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీ లత, బీసీ కార్పొరేషన్ ఈడీ రాంరెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తిరునహరి శేషాంజన్ స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనితా రామకృష్ణ, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ సభను విజయవంతం చేయాలి

**రాయపర్తిలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**


యువకులకు గులాబీ కండువాలు కప్పుతున్న మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి, అక్టోబర్ 7: ఈనెల 9న పాలకుర్తి నియోజకవర్గ పరిధి తొర్రూరులో మున్సిపల్, ఐటీ మంత్రి కేటీఆర్ పర్యటన, భారీ బహిరంగ సభలకు మండలంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ్మా నాయక్ అధ్యక్షతన జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 20వేల మందితో బైక్ ర్యాలీ, బహిరంగ సభలకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పాలకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాలపై వరాల జల్లు కురిపించేలా పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్ల సుధీర్‌రెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ ఆకుల సురేందర్‌రావు, మండల నాయకులు పూస మధు, గబ్బెట బాబు, గారె నర్సయ్య, కోదాటి దయాకర్‌రావు, సతీష్‌కుమార్, సంతోష్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో శివరామపురం యువకుల చేరిక

రాయపర్తి మండలం శివరామపురం (ఆర్ అండ్‌ఆర్ కాలనీ)కి చెందిన యువకులు శనివారం హనుమకొండలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన చెడుపాక సుధాకర్, రవి, పరశురామ్‌ల సారథ్యంలో పలువురు గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. సర్పంచ్ చెడుపాక కుమారస్వామి, తాటికాయల రఘుపతి, కన్నెకంటి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి సంతోష్‌గౌడ్, నాగపురి సోమయ్య, భూక్యా జగన్‌నాయక్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి అనునిత్యం కృషి

- పనిచేసే ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాలి
- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- రూ.51.12 కోట్లతో పలు ప్రగతి పనులకు శంకుస్థాపన
- ఎమ్మెల్యే అరూరికే మా మద్దతు
- రోల్లకల్ గ్రామ గౌడ కులస్తుల ఏకగ్రీవ తీర్మానం


మద్దతు పత్రాన్ని అందజేస్తున్న పర్వతగిరి మండలం రోల్లకల్ గౌడ సంఘం నాయకులు

హసన్‌పర్తి, అక్టోబర్ 7: నియోజకవర్గ అభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్నానని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. సీతంపేట, భైరాన్‌పల్లి, పెంబర్తి, సూదన్‌పల్లి, నాగారం, హరిశ్చంద్రనాయక్ తండా, సిద్దాపూర్, జయగిరి, వంగపహడ్ గ్రామాల్లో రూ.51కోట్ల 12లక్షల 80వేలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే రమేశ్ శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యేకు మహిళలు కోలాటాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనిచేసే ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలిచి ఆశీర్వదించాలని, అభివృద్ధి చేస్తున్న మీ బిడ్డ అరూరి రమేశ్‌ను మూడోసారి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. గ్రామాల్లో బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. అరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత, వైస్ ఎంపీపీ బండ రత్నాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సునీత, పాక్స్ చైర్మన్‌లు జక్కు రమేశ్‌గౌడ్, మెరుగు రాజేశ్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు జంగకుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ కొత్తకొండ సుభాశ్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ అంచూరి విజయ్‌కుమార్, సర్పంచ్‌లు, జనగాం శరత్, బొల్లవేని రాజురాణీ, జోరిక పూల, పెద్ది తిరుపతమ్మ–మల్లారెడ్డి, కుందూరు సాంబరెడ్డి, జనగాం ధనలక్ష్మి–కిరణ్, నునావత్ ఐలమ్మ మొగిళి, అరుణ్, పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, యూత్ అధ్యక్షుడు మేక భగవాన్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రఘు, రాజు, ఉపసర్పంచ్ సునిల్, ఏలిమి రమేశ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పంజాల కుమార్, గోపి, మోటపోతుల రాజు, బాబు, సాంబరాజు మొగిలి పాల్గొన్నారు.

### రోల్లకల్ గౌడ కులస్తుల మద్దతు

నయీంనగర్: పర్వతగిరి మండలం రోల్లకల్‌కు చెందిన గౌడ కులస్తులు ఎమ్మెల్యే అరూరికి తమ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని హనుమకొండలోని ఆయన నివాస ఆవరణలో అందజేశారు. గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏకాంతంగౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.